


వారెవ్వా... ఫిదా హోగయా!
రంజాన్ మాసం ప్రత్యేక వంటకం హలీమ్. ఈ వంటకం పట్టణ ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చింది. 8లో



టమాట కిలో రూ.8
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో...

పుట్టపర్తి టౌన్: ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీద్వారా విన్నవించుకోవచ్చని ఎస్పీ రత్న పేర్కొన్నారు. అర్జీలో ఆధార్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు.

బెల్టుషాపులపై ఆకస్మిక దాడులు!

చిలమత్తూరు: హిందూపురం పట్టణ సమీపంలోని హిందూపురం – కదిరి ప్రధాన రహదారిపై టీడీపీ నేతల మద్యం బెల్టు షాపులపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శనివారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఒక బెల్ట్‌షాపులో ఉన్న 20 మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని.. స్థానిక ఎక్సైజ్ పోలీసులకు అప్పజెప్పినట్టుగా సమాచారం. అయితే ఎక్సైజ్ పోలీసులు మాత్రం దాడులు జరగలేదని చెబుతున్నారు. ఈ నెల మూడో తేదీన 'మద్యపురం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనం రాష్ట్రస్థాయిలో వైరల్ అయ్యింది. ఆకస్మిక దాడులు నిర్వహించి కేసు నమోదు చేయాలని తెలిపినా, ఆ బెల్టు షాపులు ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలకు చెందినవన్న ప్రచారం జరిగిన నేపథ్యంలో వాటిపై చర్యలు తీసుకోవడానికి అధికారులు జంకుతున్నారని తెలుస్తోంది. ఏది ఏమైనా బహిరంగంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు సాగిస్తున్నా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం.

పీఏబీఆర్‌లో తగ్గుతున్న నీటిమట్టం



పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. ఆదివారం నాటికి జలాశయంలో 2.99 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. శ్రీసత్యసాయి, అనంత, శ్రీరామరెడ్డి, ఉరవకొండ, కూడేరు తాగునీటి పథకాలకు 55 క్యూసెక్కులు, ధర్మవరం కుడికాలువకు లీకేజీ ద్వారా 35 క్యూసెక్కులు, నీటి ఆవిరి, ఇతర లీకేజీల రూపంలో మరో 40 క్యూసెక్కుల నీరు రోజూ బయటకు వెళుతోంది.

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

గుంతకల్లు: ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లా పులివెందుల వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి అనంతపురం జిల్లా బాల, బాలికల కబడ్డీ జట్లను ఆదివారం గుంతకల్లులోని రైల్వే గ్రౌండ్‌లో ఎంపిక చేశారు. ఈ మేరకు అనంతపురం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణ్, సెలక్షన్ కమిటీ సభ్యుడు రాఘవేంద్ర తెలిపారు. బాలికల విభాగంలో విష్ణు ప్రియ (అనంతపురం), వర్ష (ప్రసన్నాయపల్లి), నవ్యశ్రీ (తాడిపత్రి), సుచరిత (ఎస్కేయూ), జాను (చిన్మయనగర్), వర్షియా (తాడిపత్రి), హిమవతి (కొర్రపాడు), ప్రణతి (కూడేరు), షాజియా (ధర్మవరం) అనుశ్రీ (విడపనకల్లు), కీర్తన (ప్రసన్నాయపల్లి), తాడిపత్రికి చెందిన యజ్ఞ, నందిని చోటు దక్కించుకున్నారు. బాలురు విభాగానికి లోకేష్ (కొకుంట్ల), మహమ్మద్ ఆసీఫ్ (ధర్మవరం), మహమ్మద్ ఉస్మాన్ (తాడిపత్రి), మల్లికార్జున (గుంతకల్లు), వరుణ్‌కుమార్ (బొమ్మనహాళ్), పవన్‌కుమార్ (అనంతపురం), సునీల్ కుమార్ (గుంతకల్లు), చరణ్ (అనంతపురం), రాజు (అనంతపురం), వేణు (వైటీ చెరువు). హర్షవర్ధన్ (తాడిపత్రి), ఏసురాజు (ధర్మవరం), విశ్వాసం దేష్ (అనంతపురం) ఎంపికయ్యారు.



యాగశాలలో కొలువుదీరిన ఖాద్రీశుడు

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలకు

వైభవంగా అంకురార్పణ

కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో వైభవంగా అంకురార్పణ చేశారు. అంకురాలను ఆరోపింప చేసే కార్యక్రమం కాబట్టి దీన్ని అంకురార్పణ అంటారని అర్చకులు పేర్కొన్నారు. మంగళ వాయిద్యాల మధ్య నారసింహుడు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఆలయానికి నైరుతి దిశలో ఉన్న మండపానికి చేరుకున్నారు. అర్చక పండితులు నిర్ణీత పునీత ప్రదేశంలో 'భూమిపూజ'తో పుట్ట మన్ను సేకరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. యాగశాలలో ఆ మట్టితో నింపిన 9 పాలిక(కుండ)లలో నవ ధాన్యాలతో అంకురార్పణ (బీజావాపం) చేశారు. ఈ నవధాన్యాలు దిన దినాభివృద్ధి చెందేలా అర్చకులు బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకూ రోజూ నీరు పోస్తారు. ఏ ధాన్యం బాగా మొలకెత్తుతుందో ఆ పంట ఈ యేడాది బాగా పండుతుందని ప్రజల నమ్మకం. బ్రహ్మోత్సవాల్లో నారసింహుడు ఈ పక్షం రోజుల పాటు యాగశాలలోనే గడిపి, ఇక్కడి నుంచే భక్తులకు దర్శనమిస్తారు.

పక్షం రోజులూ వెలిగే అగ్ని హోత్రం

యాగశాలలో అంకురార్పణ గావించిన అనంతరం అగ్నిహోత్రం వెలిగించారు. ఈ ఉత్సవాలు పూర్తయ్యేవరకూ పక్షం రోజులపాటు అగ్నిహోత్రం ధగ ధగ మండేలా అర్చకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న పండితులు

ఉత్సవాలను నలుదిక్కులూ చాటడానికి సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రధాన ధ్వజ స్తంభానికి గరుడ దండాన్ని ధ్వజారోహణం గావిస్తారు. దీన్ని బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేరోజు అంటే తీర్థవాది నాడు శ్రీవారి చక్రస్నానం అనంతరం అవరోహణం గావించి ఉత్సవాలకు ముగింపు పలుకుతారు. శ్రీవారి అంకురార్పణానికి ఉభయదారులుగా బెంగళూరుకు చెందిన కేఎస్ నాగేశ్వరరావు కుటుంబీకులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేడు కాటమ రాయుడి కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీవారి కల్యాణోత్సవం సోమవారం రాత్రి 9 గంటలకు జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి లోకేష్ స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తారని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మీడియాకు తెలిపారు. శ్రీవారి కల్యాణోత్సవాన్ని భక్తులందరూ కనులారా వీక్షించేందుకు ఆలయ, పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. కల్యాణోత్సవం జరిపేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి కొందరు అర్చక పండితులు హాజరుకానున్నారు. శ్రీవారి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సోమవారం సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పట్టణంలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

చిన్నబోయిన చీనీ



> చీనీ రైతులను కష్టాలు చుట్టుముట్టాయి. టన్ను రూ.50వేలు పలికిన చీనీకాయలు నాలుగు రోజుల వ్యవధిలోనే ధర రూ.20వేలకు పడిపోయింది. ఇంకోవైపు బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటి నీటిమట్టం తగ్గిపోవడంతో పంటను ఎలా కాపాడుకోవాలో దిక్కుతోచక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

- ధర భారీగా పతనం
- అడుగంటుతున్న భూగర్భజలం
- గిట్టుబాటు ధర వచ్చే వరకు కాపాడేదెలా?
- ఆందోళన చెందుతున్న చీనీ రైతులు

తాడిమర్రి: చీనీ రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ధరాఘాతం కోలుకోలేని దెబ్బతీసింది. జిల్లాలోని 31 మండలాల్లో దాదాపు 14వేల హెక్టార్ల విస్తీర్ణంలో 13,500 మంది రైతులు చీనీ సాగు చేస్తున్నారు. ప్రధానంగా తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ, కనగానపల్లి మండలాల్లో చీనీ తోటలు అధికంగా విస్తరించాయి. ఇక తాడిమర్రి మండలం కునుకుంట్ల, శివంపల్లి, తాడిమర్రి, చిల్లకొండయ్యపల్లి, చిల్లవారిపల్లి, మద్దులచెర్వు, మోదుగులకుంట గ్రామాల్లో అధిక మంది రైతులు చీనీనే సాగు చేస్తున్నారు. ఎర్రమట్టి నేలలు కావడం, సేంద్రియ ఎరువులు విరివిగా వాడుతుండడంతో పంట దిగుబడి బాగా ఉంటోంది. దీనికి తోడు ఇక్కడ పండిన చీనీకాయలు తియ్యగా ఉండటంతో వీటికి అనంతపురం, బెంగళూరు, చెన్నై మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంటోంది. అయితే ఈ ఏడాది చీనీకి ఎర్రనల్లి, వేరుకుళ్లు, పొలుసు పురుగు వ్యాధులు సోకడంతో రైతులు అష్టకష్టాలు పడి నివారణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకున్నారు. అయితే ఊహించని విధంగా మార్కెట్లో ధర పతనమైంది. టన్ను రూ.50వేల దాకా పలికిన చీనీకాయల ధరలు ఇప్పుడు సగానికి పడిపోయాయి.

ఆగిపోయిన పంటల బీమా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పండ్లతోటల రైతులకు పంటల బీమా వర్తింప చేసి విపత్తుల సమయంలో ఆదుకున్నారు. ముఖ్యంగా గడిచిన నాలుగేళ్ల పాటు చీనీ సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.17 వేలు, రూ.16 వేల ప్రకారం పంటల బీమా కింద అందించారు. దీంతో పంట పెట్టుబడుల విషయంలో రైతులకు కాస్త ఊరట లభించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో చీనీ తోటలకే కాదు అరటి, దానిమ్మ, టమాట, మామిడి తదితర ఏ పంటకు కూడా బీమా వర్తింపజేయకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఉన్నట్టుండి ధర పడిపోయింది



చీనీ పంటకు ఉన్నట్టుండి ధర పడిపోయింది. గత వారం వరకు అనంతపురంలో టన్ను రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పలికింది. బెంగళూరు మార్కెట్‌లో రూ.40 వేల నుంచి రూ.45 వేలు, చెన్నై మార్కెట్‌లో రూ.45 వేల నుంచి రూ.50 వేలు పలికింది. ఇప్పుడు అనంతపురం రూ.15 వేలు, బెంగళూరులో రూ.20 వేలు, చెన్నైలో రూ.25 వేలకు ధర పడిపోయింది. దీంతో కాయలు కొనడానికి వ్యాపారస్తులు ముందుకు రావడం లేదు. దీంతో పంటను కోయకుండా తోటల్లోనే వదిలేశాం.

– వడ్డి నాగశివారెడ్డి, కునుకుంట్ల, తాడిమర్రి

పంటల బీమా అందించి ఆదుకోవాలి



గత ప్రభుత్వంలో పండ్లతోటలు సాగు చేసిన రైతులకు పంటల బీమా అందేది. పంటలకు గిట్టుబాటు ధర లభించని సమయంలో బీమా ఎంతో ఊరటను ఇచ్చేది. కూటమి ప్రభుత్వం రాగానే పంటల బీమా ఎత్తేసింది. గిట్టుబాటు ధర లేకపోవడం, బీమా రాకపోవడంతో రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది.

– వడ్డి లింగారెడ్డి, కునుకుంట్ల, తాడిమర్రి

పంటను ఎలా కాపాడుకోవాలో?



ఒక పక్క చీనీ కాయలకు గిట్టుబాటు ధర పడిపోవడం, మరోపక్క భూగర్భ జలాలు అడుగంటడం రైతులకు చాలా ఇబ్బందికరంగా ఉంది. గిట్టుబాటు ధర పలికే వరకు కాయలు కోయకుండా ఉందామంటే బోరు బావుల్లో నీరు తగ్గడంతో చెట్లకు చాలడం లేదు. భూగర్భ జలాలు అడుగంటినప్పుడు చెట్లలో కాయలు లేకపోతే తక్కువ నీటితో చెట్లను మరికొన్ని రోజులు కాపాడుకోవచ్చు. ఇప్పుడు ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

– చాకలి కిష్టప్ప, కునుకుంట్ల, తాడిమర్రి

రైతులు కాస్త ఓపిక పట్టాలి



వేసవి సీజన్‌లో ఎండలు అధికమైనపుడు చీనీకాయలకు కూడా గిట్టుబాటు ధర పెరుగుంది. రైతులు కాస్త ఓపిక పట్టాలి. భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో నీరు తగ్గిన రైతులు చెట్లను కాపాడుకోవడానికి నీటిలో యూరియా కలిపి పిచికారీ చేసుకుంటే కొన్ని రోజులు చెట్లు ఎండిపోకుండా ఉంటాయి.

– అమరేశ్వరి, ఉద్యానవన అధికారి

ఆకట్టుకున్న సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయిపై కృతజ్ఞతను చాటుతూ ఆదివారం సాయంత్రం మహాసమాధి చెంది విద్యార్థులు నిర్వహించిన సంగీత కచేరీ ఆకట్టుకుంది. భక్తి గీతాలతో చక్కటి సందేశాన్నిస్తూ విద్యార్థులు ఆలపించిన తీరు భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

జయహో భారత్.



అనంతపురం టవర్‌క్లాక్ వద్ద ఆనందోత్సాహంలో అభిమానులు

చాంపియన్స్ ట్రోఫీలో ఇండియా జయకేతనం ఎగురవేసింది. ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి రోహిత్ సేన ట్రోఫీని కైవసం చేసుకుంది. దీంతో అభిమానుల సంబరాలు మిన్నంటాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో ఆదివారం రాత్రి టపాసులు కాలుస్తూ సంతోషం వ్యక్తం చేశారు. జయహో భారత్ అంటూ నినదించారు. భవిష్యత్తులో భారత జట్టు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



జాతీయ జెండా చేతబూని..

జయ జయ మహాదేవ..

- నేత్రపర్వం.. చంద్రమౌళీశ్వరుడి బ్రహ్మ రథోత్సవం
- శివనామస్మరణతో మార్మోగిన గవిమఠం పరిసరాలు



చంద్రమౌళీశ్వరస్వామి మూలవిరాట్‌ను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



అశేష భక్త జనసందోహం నడుమ ముందుకు సాగుతున్న గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి మహా రథం

ఉరవకొండ: 'జయ జయ మహాదేవ.. శంభో సదా శివ' అంటూ భక్తులు చేసిన ప్రణవనాదం ప్రతిధ్వనించింది. భక్తులతో గవిమఠం కిటకిటలాడింది. చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మరథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు, మహా రుద్రాభిషేకాలు నిర్వహించారు. గవిమఠం 8వ పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవ రాజేంద్ర స్వామి, ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, మఠం సహాయ కమీషనర్ కె.రాణి ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వరుడి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహారథం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం శాస్త్రోక్తంగా రథం చుట్టూ ప్రదక్షిణలు, పూజలు చేసిన అనంతరం ఉత్సవ మూర్తిని రథంపై కొలువుదీర్చి ఉత్సవం ప్రారంభించారు. గవిమఠ ఆస్థాన గజలక్ష్మి (ఏనుగు) రథాన్ని అనుసరిస్తూ ముందుకు కదలగా.... హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు ముందుకు లాగుతూ భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. రథంపై పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించడానికి ఆంధ్రా, తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది.

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం!

- చంద్రబాబు సర్కారు మోసంపై అంగన్‌వాడీల సమరభేరి
- నేడు విజయవాడలో మహాధర్నాకు పిలుపు
- జిల్లా నుంచి అంగన్‌వాడీలు వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డగింత

తాడిపత్రి రూరల్: అంగన్‌వాడీలపై చంద్రబాబు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తున్న వైనంపై నిరసన తెలిపేందుకు అంగన్‌వాడీలు సోమవారం విజయవాడలో మహా ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో జిల్లా నుంచి మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ పోలీసులతో చంద్రబాబు ప్రభుత్వం అడ్డుకుంది. పైగా వారిని భయపెట్టేందుకు సెక్టార్ మీటింగ్ అంటూ డ్రామాకు తెరలేపింది. మహా ధర్నాకు బయలుదేరిన తీవ్ర పరిణామాలు ఉంటాయని ఐసీడీఎస్ అధికారులు హెచ్చరికలకు దిగారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు అంగన్‌వాడీల కదలికలపై నిఘా ఉంచారు. ముందస్తు నోటీసులు అందించారు. అయినా విజయవాడ మహాధర్నాకు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్ల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. యూనియన్ నాయకుల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకూ వెనుకాడలేదు. అంగన్‌వాడీ సెంటర్లను మూసివేసి ధర్నాకు వెళ్లే వారి వివరాలను సేకరించాలని గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. అయితే, ఎన్ని అడ్డంకులు సృష్టించినా మహాధర్నాకు వెళ్లి తీరుతామని అంగన్‌వాడీలు తెలిపారు.

సెలవు ఇవ్వం



ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఎవరికీ సెలవు ఇవ్వడం లేదు. సెక్టార్ మీటింగ్ పెట్టుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాల గురించి వివరించడానికి సూపర్‌వైజర్లు మీటింగ్ పెట్టుకుంటున్నారు. అంగన్‌వాడీలపై ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు చేయడం లేదు. – సాజిదాబేగం, సీడీపీఓ, తాడిపత్రి

హామీలు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వ బెదిరింపులకు అంగన్‌వాడీలు భయపడరు. ప్రభుత్వ మెడలు వంచైనా హామీలను నెరవేర్చుకుంటాం. గతంలో గుర్రాలతో తొక్కించినా భయపడలేదు. ప్రస్తుతం మహాధర్నాను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

– శకుంతల, ఉమ్మడి జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు

క్లుప్తంగా

శ్రీ గంధం చెట్లకు నిప్పు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సోమందేపల్లి: మండలంలోని మండ్లి గ్రామ సమీపంలో సాగులో ఉన్న శ్రీగంధం చెట్లకు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. రైతు లక్ష్మీనారాయణ సాగు చేసిన 3 వేల శ్రీగంధం చెట్లలో 2 వేల చెట్లు కాలిపోయాయి. అక్కడికి సమీపంలోని మామిడి తోటలకు మంటలు వ్యాపించి మహిళా రైతు అనంతమ్మ సాగు చేసిన 500 చెట్లు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఘటనలో డ్రిప్ పరికరాలు కూడా కాలిపోవడంతో దాదాపు రూ. 5లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. సమీపంలోని బయటు ప్రదేశంలో మద్యం తాగేందుకు వచ్చిన ఆకతాయిలే ఇందుకు కారణంగా పలువురు ఆరోపించారు.

యువకుడి ఆత్మహత్య




హిందూపురం అర్బన్: స్థానిక రెండో పట్టణ పీఎస్ పరిధిలోని సిల్క్ కాలనీ సమీపంలో ఆదివారం ఓ గుర్తు తెలియని యువకుడు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లాస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

బీటెక్ విద్యార్థిని అదృశ్యం

ధర్మవరం అర్బన్: స్థానిక రామనగర్‌కు చెందిన ఓ బీటెక్ విద్యార్థిని కనిపించడం లేదు. అనంతపురం శివారులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆమె శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు రెండో పట్టణ పీఎస్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వృద్ధుడి మృతి



మృతుడు రామన్న

అమరాపురం: మండలంలోని పేలుబండ గ్రామానికి చెందిన రామన్న(70) ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడి మృతి చెందాడు. శనివారం సాయంత్రం బసవనపల్లిలోని భూతప్ప ఆలయంలో పూజలు చేసిన అనంతరం రాత్రికి అక్కడే బస చేయడం ఆయన అలవాటు. ఈ క్రమంలోనే గత శనివారం ఆలయానికి వెళ్లిన ఆయన పూజలు ముగించుకుని రాత్రికి అక్కడే బస చేశారు. ఆదివారం ఉదయం అక్కడికి సమీపంలోని శివన్న పొలంలో ఉన్న చింతచెట్టు కాయలు దులిపేందుకు కూలి పనికి వెళ్లాడు. చెట్టు ఎక్కి చింత కాయలు దులుపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య తిమ్మక్క ఫిర్యాదు మేరకు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



ఫిదా హోగయా!

- నోరూరిస్తున్న అరబ్బుల ప్రత్యేక వంటకం
- జిల్లా వ్యాప్తంగా హలీమ్‌కు పెరుగుతున్న క్రేజ్



హిందూపురంలో విక్రయానికి హలీమ్‌ను సిద్ధం చేస్తున్న తయారీదారుడు

గుంతకల్లు/హిందూపురం: రంజాన్ మాసంలో మాత్రమే లభించే అరబ్బుల ప్రత్యేక వంటకం హలీమ్... ప్రస్తుతం హాట్ ట్రెండ్‌గా మారింది. నోరూరించే ఈ వంటకాన్ని తిన్న వారు.. 'వారెవ్వా... ఫిదా హోగయా' అంటూ కితాబునివ్వడం విశేషం. ఒకప్పుడు మహా నగరాలకే పరిమితమైన ఈ వంటకం కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చింది. అక్కడి నుంచి పార్శిల్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు తయారీదారులు చేరవేస్తున్నారు.

గత పదేళ్లుగా..

గత పదేళ్లుగా ఉమ్మడి జిల్లాలోని గుంతకల్లు, తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కదిరి, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం తదితర పట్టణాలతో పాటు అనంతపురం నగరంలోనూ ఆహారప్రియులను హలీమ్ సెంటర్లు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఒకటి రెండు చొప్పున ఏర్పాటు కాగా, నగరంలో పెద్ద సంఖ్యలో సెంటర్లను నెలకొల్పి కిలోల లెక్కన హలీమ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇందు కోసం హైదరాబాద్ ప్రాంతం నుంచి ప్రత్యేకంగా మాస్టర్లను రంగంలో దింపారు. ఇందులో ఉపయోగించే మసాలాలు, ఇతర సుగంధ ద్రవ్యాలను హైదరాబాద్ నుంచే దిగుమతి చేసుకుంటున్నారు.

తయారీకి గంటల సమయం..

చికెన్, మటన్ అనే రెండు రకాల హలీమ్‌ను జిల్లాలో సిద్ధం చేసి విక్రయిస్తున్నారు. దీని తయారీకి ఐదారు గంటలకు పైగా సమయం పడుతుందని తయారీ దారులు అంటున్నారు. స్వచ్ఛమైన నెయ్యి, వెన్న, గోధుమలు, శనగ పప్పు, బార్లీ, జీడిపప్పు, బాదం, షాజీరా, యాలకులతో పాటు ఉల్లిపాయలు, పుదీనా, కొత్తిమీర వంటి దాదాపు 30 రకాల వివిధ రుచికరమైన దినుసులను వినియోగిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన బట్టీలో కట్టెలను మండిస్తూ సిద్ధం చేసుకున్న మసాలా దినుసులతో పాటు బోన్‌లెస్ చికెన్, బోన్‌లెస్ మటన్‌ను వేర్వేరు పాత్రల్లో కలిపి ఐదారు గంటలకు పైగా ఉడికిస్తారు. ఈ క్రమంలో పప్పు గిత్తి తరహాలో పెద్ద పరిమాణంలో ఉన్న గూట కర్రతో తిరగకొడుతూ మెత్తని పేస్ట్‌లా మార్చేస్తారు. ఇలా పేస్ట్‌లా మారిన తర్వాత అందులో నెయ్యి వేసి అంటకాగకుండా కలియతిప్పుతూ విక్రయానికి సిద్ధం చేస్తారు. ప్రాంతాన్ని బట్టి 250 గ్రాముల చికెన్ హలీమ్‌ను రూ.100 నుంచి రూ.200 వరకు, మటన్ హలీమ్‌ను రూ.120 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు.

శ్రమతో కూడుకున్నదే..



హలీమ్ తయారీ అనేది చాలా శ్రమతో కూడుకున్నది. అందుకే కేవలం రంజాన్ మాసాల్లోనే దీనిని ఎక్కువగా చేస్తుంటాం. రుచికరమైన హలీమ్ కోసం ఐదారు గంటలకు పైగా శ్రమించాల్సి ఉంటుంది. ఇందులో వాడే దినుసలన్నీ ఎంతో బలవర్ధకంగా ఉంటాయి.

– బాబా ఫక్రుద్దీన్, హలీమ్ మాస్టర్, గుంతకల్లు

ఆరోగ్యకరం



ఎంతో విశిష్టమైన రంజాన్ మాసాన్ని కఠిన ఉపవాస దీక్షతో ఆచరిస్తుంటాం. ఈ క్రమంలో త్వరగా శరీరం అలసటకు గురై, అనారోగ్యం బారిన పడే ప్రమాదమూ ఉంది. దీంతో ఉపవాస దీక్ష విరమించే సమయంలో తీసుకునే ఖర్జూరాలు మన శరీరానికి అవసరమైన శక్తిని త్వరగా అందిస్తాయి. ఇక హలీమ్ ద్వారా ఎన్నో రకాల పోషకాలు అందుతాయి. దీంతో కఠిన ఉపవాస దీక్షలు చేస్తున్న వారిలో సైతం అలసట అనేది కనిపించదు.

– షేక్ మహబుబ్‌బాషా, గుంతకల్లు

సమ్‌థింగ్ Special

యువతకు అండగా నిలుద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌గౌడ్ (చిత్రంలో) వివిధ సంఘాల నాయకులు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వ పాలనలో దగా పడుతున్న యువతకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ తలపెట్టిన యువత పోరును జయప్రదం చేద్దామంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఐక్య విద్యార్థి, కుల సంఘాల నాయకులతో కలసి అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్ల సాధనలో భాగంగా ఈ నెల 12న ఉదయం 10 గంటలకు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ ఉంటుందన్నారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, తదితర హామీలను నెరవేరుస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేష్ హామీనిచ్చి మోసం చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా 1,35,000 మందికి, వైద్య రంగంలో 75,000 మందికి ఉద్యోగాలను కల్పించిందన్నారు. పేదరికం చదువుకు అడ్డు రాకూడదని ఫీజురీయింబర్స్‌మెంట్‌ను పక్కాగా అమలు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా దగా చేసిందన్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో కేవలం 11 వైద్య కళాశాలలు మాత్రమే ఉండేవని, వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో 5 కళాశాలల్లో 2,550 మంది విద్యార్థులకు అడ్మిషన్లు సైతం కల్పించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కొన్ని కళాశాలలు వద్దని కేంద్రానికి లేఖరాయడమే కాక, మిగిలిన వాటిని ప్రైవేట్ పరం చేయాలనే కుట్ర సాగించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీ, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, జీవీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మల్లికార్జున నాయక్, ఎస్సీ జనసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుళ్లాయప్ప, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు బిల్లే జగదీష్, ఎస్వీఎస్‌ఎఫ్‌బీసీ చక్రధర్ యాదవ్, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జేన్నే చిరంజీవి, బీసీ ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేశవ గౌడ్, జీపీఎస్ జిల్లా అధ్యక్షులు సాకే ఆనంద్, వైఎస్సార్ విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు కైలాష్ తదితరులు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేస్తామన్నారు.

'వెలుగు'లో టీడీపీ నేత చిచ్చు

- టీడీపీ నేత చెబితే చేసి తీరాల్సిందేనంటూ స్వామి భక్తి చాటిన ఏపీఎం
- సీసీల సంతకం లేకుండానే రుణాలు మంజూరు చేసిన వైనం
- నాలుగు గోడల మధ్య పరస్పర దూషణలతో రెచ్చిపోయిన వెలుగు సిబ్బంది



కుందుర్పి: స్వలాభం కోసం వెలుగు పథకంలో పనిచేస్తున్న ఏపీఎం, సీసీల మధ్య ఓ టీడీపీ నేత చిచ్చు రగిల్చాడు. ఇది కాస్త దావాలనమై కార్యాలయం నాలుగు గోడల మధ్య రెండు రోజుల క్రితం భగ్గున మండింది. పరస్పర దూషణలతో ఏపీఎం, సీసీ రెచ్చిపోయారు. కుందుర్పి మండల వెలుగు కార్యాలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన ఆడియో వైరల్ కావడంతో టీడీపీ నేత బండారం బట్టబయలైంది.

ఏం జరిగిందంటే..

కుందుర్పి మండలంలో పనిచేస్తున్న ఏపీఎం సర్దానప్ప తీరుతో గత రెండు రోజులుగా మండల సమాఖ్య కార్యాలయంలో పెద్ద వివాదం నెలకొంది. పలు గ్రామాలకు చెందిన సంఘాల సభ్యులకు సంబంధించి రుణాల మంజూరుకు సీసీలు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఏపీఎం దృష్టికి పంపారు. అయితే దీనిపై ఏపీఎం అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్థానిక టీడీపీ నేత సూచించిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల దరఖాస్తులను తిరస్కరించారు. దీనిపై సీసీలను బాధిత సభ్యులు నిలదీయడంతో ఇందులో తమ ప్రమేయం లేదని చేతులెత్తేశారు. రుణాల మంజూరు అంశం ఏపీఎం పరిధిలో ఉంటుందని సమాధానమిచ్చారు.

కుర్చీలు విసురుకుని...

రుణాల అంశంలో అన్యాయానికి గురైన పలువురు సభ్యులు రెండు రోజుల క్రితం వెలుగు కార్యాలయంలో ఏపీఎం, సీసీలను నిలదీశారు. అందరి సమక్షంలో ఏపీఎం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండుటెండలో చెమటోడ్చి పనులు చేస్తున్నది టీడీపీ నేత కాదనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని హితవు పలికారు. వివక్ష మాని అందరినీ సమదృష్టి చూడాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో అక్కడే ఉన్న సీసీ తిమ్మప్పపై ఏపీఎం సర్దానప్ప తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. టీడీపీ నేత చెబితే పనిచేసి తీరాల్సిందేనని, తాను టీడీపీ నేత మాట వినప్పుడు మీరెందుకు వినరంటూ సీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంది. నువ్వెంతంటే.. నువ్వెంత అని దూషించుకుంటూ కుర్చీలను విసిరారు. అక్కడే ఉన్న స్త్రీ నిధి మేనేజర్ గోవిందు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

సీసీలు ఏమంటున్నారంటే..

ఘటనకు సంబంధించి పలువురు సీసీలు మాట్లాడుతూ.. తమ సంతకాలు లేకుండానే టీడీపీ నాయకులు చెప్పిన వారికి రుణాలు చేస్తానని ఏపీఎం సర్దానప్ప చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ తమ సంతకాలు లేకుండానే టీడీపీ కార్యకర్తల కుటుంబసభ్యులకు ఏపీఎం రుణాలు మంజూరు చేయడం వివాదానికి కారణమైందన్నారు.

ఇదేం పెద్ద సమస్య కాదు

'ఔను వాళ్లిద్దరూ వాదులాడుకున్నారు. కార్యాలయంలోనే గొడవ పడ్డారు. ఈ విషయంగా వారిని ఎమ్మెల్యే అల్లుడు ధర్మతేజ పిలిపించి మందలించాడు. ఆ సమయంలో నేను విజయవాడలో ఉన్నా. సోమవారం కార్యాలయానికి ఏపీఎం, సీసీలను పిలిపించుకుని మాట్లాడుతాను. ఇదేం పెద్ద సమస్య కాదు'.

– నారాయణస్వామి, ఏరియా కో ఆర్డినేటర్, వెలుగు, కళ్యాణదుర్గం

లక్ష్యానికి చేరువలో 'మార్కెటింగ్'

- 102 శాతంతో రాయదుర్గం మార్కెట్ కమిటీ టాప్

అనంతపురం అగ్రికల్చర్: ఈ నెలాఖరుతో ముగియనున్న 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన లక్ష్యసాధనకు మార్కెట్ కమిటీలు చేరవవుతున్నాయి. ఓవరాల్‌గా వంద శాతం సాధించే దిశగా పయనిస్తున్నా... రెండు మూడు కమిటీలు వెనుకంజలో ఉన్నాయి. ఈ ఏడాది జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, వాటి పరిధిలో ఉన్న 15 చెక్‌పోస్టుల ద్వారా రూ.12.06 కోట్లు సాధించాలని లక్ష్యం నిర్దేశించగా... ఫిబ్రవరితో ముగిసిన 11 నెలల కాలంలో 82.70 శాతంతో రూ.9.97 కోట్ల వసూళ్లు సాధించాయి. ఇంకా మార్చి నెలంతా సమయం ఉన్నందున ఓవరాల్‌గా జిల్లా మార్కెటింగ్‌శాఖ 100 శాతం చేరుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

- శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని 8 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.5.31 కోట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా 11 నెలల కాలంలో 82.36 శాతంతో రూ.4.37 కోట్లు వసూలు సాధించాయి. పెనుకొండ మార్కెట్ కమిటీ రూ.14 లక్షలకు గానూ రూ.20.40 లక్షలతో 145 శాతంతో ఇప్పటికే మొదటి స్థానంలో నిలిచింది. అలాగే తనకల్లు మార్కెట్ కమిటీ కూడా రూ.14 లక్షలకు గానూ 122 శాతంతో రూ.17.04 లక్షలు సాధించి రెండో స్థానంలో కొనసాగుతోంది. గోరంట్ల మార్కెట్ కమిటీ 96 శాతం, మడకశిర 93 శాతం, పుట్టపర్తి 87 శాతం, హిందూపురం 69 శాతం వసూళ్లతో లక్ష్యానికి చేరువగా ఉన్నాయి. 58 శాతం వసూళ్లతో ధర్మవరం మార్కెట్ కమిటీ ఒక్కటే లక్ష్య సాధనలో వెనుకంజలో పయనిస్తోంది.

రవాణాశాఖ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎంపిక

కడప వైఎస్సార్ సర్కిల్: రవాణాశాఖలో రాయలసీమ నాన్ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు సంబంధించిన కమిటీని ఆదివారం కడపలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెద్దిరెడ్డి లక్ష్మికర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కమిటీ సభ్యుల్లో జోన్ వైస్ ప్రెసిడెంట్–1గా కె.సువర్ణకుమారి (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, అనంతపురం), జోన్ ట్రెజరర్‌గా ఎస్.రవిప్రకాష్ (సీనియర్ అసిస్టెంట్, హిందూపురం)కు చోటు దక్కింది.

జాతీయ రహదారిపై చైన్ స్నాచింగ్

బుక్కరాయసముద్రం: మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలో నివాసముంటున్న రమేష్, వనజ దంపతులు గార్లదిన్నెలో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం వనజ, తన కుమారుడిని స్కూటీ వాహనంపై ఎక్కించుకుని గార్లదిన్నెకు బయలుదేరింది. లోలూరు క్రాస్ వద్దకు చేరుకోగానే ఇద్దరు యువకులు ఆపి, అడ్రస్ అడిగే నెపంతో ఆమె దృష్టిని ఏమార్చి మెడలోని 3 తులాల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉద్యమాలకు సిద్ధం కండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్

గుంతకల్లు: ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు ఇచ్చిన హామీలు, మేనిఫెస్టో అమలు కావాలంటే పోరాటాలతోనే సాధ్యమవుతుందని, ఈ నేపథ్యంలో ఉద్యమాలకు సిద్ధం కావాలని జిల్లా ప్రజలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం గుంతకల్లులోని సీపీఎం కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాంభూపాల్ మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పీ4 సర్వేను చేపట్టి ఇప్పటికే సంక్షేమ ఫలాలు లబ్ధిదారుల సంఖ్యను కుదించే కుట్రకు కూటమి సర్కార్ తెరలేపిందని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, సాగునీటి వనరుల అభివృద్ధి, పేదరిక నిర్మూలన తదితర అంశాలకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ గత 9 నెలల్లో అమలు చేయకుండా సీఎం చంద్రబాబు మోసం చేశారన్నారు. విద్యుత్ చార్జీలపై అదనపు భారం వేస్తూనే తమ కూటమి అధికారం వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు పెంచలేదని శాసనసభలో మంత్రి రవికుమార్ అవాస్తవాలు చెప్పడం కూటమి బూటకపు పాలనకు నిదర్శనమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారన్నారు. ఇందులో భాగంగానే చర్చిల సర్వే పేరుతో మత విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రకు తెరదీశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, జిల్లా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సాకే నాగరాజు, నాయకులు కసాపురం రమేష్, జగ్గిలి రమేష్, సురేంద్ర, నిర్మల, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అబ్బుర పరిచిన రాతిగుండు పోటీలు



రాతి గుండు ఎత్తుతున్న కర్ణాటకకు చెందిన కర్ణ

పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రమైన యాడికి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రాతిగుండు ఎత్తు పోటీలు అబ్బుర పరిచాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన పది మందికి పైగా పోటీల్లో పాల్గొన్నారు. కర్ణాటకకు చెందిన కర్ణ అనే యువకుడు గుండును సునాయాసంగా ఎత్తి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే రెండో స్థానంలో రాయదుర్గం నివాసి రాజశేఖర్, మూడో స్థానంలో డోన్ మండలం దొరసానిపల్లికి చెందిన చందు నిలిచారు. విజేతలను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు.

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా

- కుంటలో ఈతకెళ్లి ఇద్దరు బాలుర మృతి





మృతిచెందిన రిహాన్ అయాన్

హిందూపురం: ఈత సరదా ఇద్దరు చిన్నారులను బలిగొంది. వివరాలు... హిందూపురం సమీపంలోని ఆటోనగర్‌లో నివాసముంటున్న జహీర్ కుమారుడు రిహాన్ (14), సుహేల్, ఉమేరా దంపతుల కుమారుడు అయాన్ (12) స్థానిక పాఠశాలలో 7, 6 తరగతులు చదువుకుంటున్నారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలసి సమీపంలోని నీటి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లారు. లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగిపోయారు. పిల్లల కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న వారు అక్కడకు చేరుకుని నీట మునిగిన ఇద్దరినీ వెలికి తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న ఇద్దరినీ వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. చికిత్సకు స్పందించిక రిహాన్, అయాన్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆటోనగర్ వాసులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. చిన్నారుల మృతదేహాలను చూడగానే కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై రెండో పట్టణ పీఎస్ సీఐ అబ్దుల్ కరీం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కంటైనర్ ఢీకొని యువకుడి మృతి



నరసింహమూర్తి (ఫైల్)

పరిగి: మండలంలోని నేతులపల్లి సమీపంలో 544ఈఈ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకున్న ప్రమాదంలో హరిజన నరసింహమూర్తి(35) మృతి చెందాడు. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు.. కర్ణాటకలోని విరపసముద్రం గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ కుమారుడు నరసింహమూర్తి తన వ్యక్తి గత పనులపై ఆదివారం హిందూపురానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొడికొండ నుండి శిరా నేషనల్ హైవేపై ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తుండగా మడకశిర వైపు నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ వాహనం ఢీకొంది. ఘటనలో నరసింహమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య గంగాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


యువతి బలవన్మరణం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లికి చెందిన నరసింహమూర్తి, సరస్వతి దంపతుల కుమార్తె అనిత (18) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిరలోని కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అనితకు ఆరు నెలల క్రితం మంజునాథ్ అనే యువకుడితో వివాహమైంది. నాలుగు రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం కడుపు నొప్పి భరించలేని ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ప్రొబేషనరీ డీఎస్పీ కె.ఉదయ పావని, మడకశిర రూరల్ పీఎస్ సీఐ రాజ్‌కుమార్ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పుట్టపర్తి టౌన్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కొత్తచెరువు సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద ఓ మృతదేహాన్ని ఆదివారం రైల్వే పోలీసులు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించారు. రైలు చక్కాలు దూసుకెళ్లడంతో తల, మొండెము, కాళ్లు, చేతులు ముక్కలుముక్కలయ్యాయి. లోకో పైలెట్ సమాచారంతో ఆదివారం ఉదయం అక్కడకు చేరుకున్న రైల్వే పోలీసులు పరిశీలించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యాచకుడి మృతి



ధర్మవరం అర్బన్: పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని 55 ఏళ్ల వయసున్న వ్యక్తి అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఆదివారం మృతి చెందాడు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించి ఖననం చేశారు.